సాక్షి సూర్యాపేట

సోమవారం ၊ 23 ၊ డిసెంబర్ ၊ 2024



యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం లో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. - 8లో



ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి
దివ్యాంగుల కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ అన్నారు. - 8లో



28 నుంచి యూటీఎఫ్ సభలు
ఈనెల 28 నుంచి టీఎస్‌యూటీఎఫ్ మహా సభలు జరగనున్నాయని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు తెలిపారు. - 8లో

వేలం ధాన్యం ఇస్తలేరు!

పదకొండు నెలలైనా పట్టించుకోని రైస్ మిల్లర్లు

- వేలం ధాన్యం ఇచ్చేందుకు మిగిలింది తొమ్మిది రోజుల గడువే..
- ఇప్పటి వరకు ఇచ్చింది 14 శాతమే
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



వేలం ధాన్యం వివరాలు (మెట్రిక్ టన్నుల్లో..)	
మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యం	2,98,259
వేలందారుడికి ఇచ్చింది	43,039
ఇంకా ఇవ్వాల్సింది	2,55,220

కోదాడ: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం పౌరసరఫరాల శాఖ మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం వేలం వేసినా తిరిగి ఇవ్వకుండా అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. బియ్యం ఇవ్వమంటే.. ధాన్యం నాణ్యతగా లేదు.. మేము బియ్యం ఇవ్వలేం.. మీ ధాన్యం మీరే తీసుకెళ్లండి అని మిల్లర్లు ఇంతకాలం చెబుతూ వచ్చారు. అయితే ఇచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం వేలం వేసింది. వేలంలో ధాన్యం దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఈ నెల 31 వరకు అప్పగించాల్సి ఉంది. ధాన్యం అప్పగిస్తేనే ప్రభుత్వానికి డబ్బులు చెల్లిస్తానని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. కానీ, మిల్లర్లు మాత్రం ఆ ధాన్యాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించమంటే మా వద్ద ధాన్యం లేదంటున్నారు. ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా ఖాతరు చేయకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారు. దీంతో అధికారులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

నెలలు గడుస్తున్నా..

2022–23 యాసంగి సీజన్‌లో సీఎంఆర్ కోసం ప్రభుత్వం ధాన్యం సేకరించి జిల్లాలోని 53 మిల్లులకు అప్పగించింది. ఈ ధాన్యం మర ఆడించి కొంత మంది మిల్లర్లు బియ్యం అప్పగించగా ఎక్కువ మంది ఇవ్వకుండా సతాయిస్తున్నారు. దీంతో ఈ సంవత్సరం జనవరి నెలలో మిల్లుల్లో ఉన్న ధాన్యం వేలం వేసిన ప్రభుత్వం వేలందారులకు అప్పగించాలని నిర్ణయించింది. సదరు కాంట్రాక్టర్ వేలం ధాన్యం తీసుకొని పోవడానికి వస్తే చాలా మిల్లుల్లో ధాన్యమే లేదు. అప్పటికే ఆ ధాన్యం మర ఆడించి బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలం వేసి 11 నెలలు గడుస్తున్నా కొందరు మిల్లర్లు మాత్రమే ధాన్యం బదులు కాంట్రాక్టర్‌కు నగదు చెల్లించి బయట పడ్డారు. ఇంకొందరు తమ వద్ద అరకొరగా ఉన్న ధాన్యాన్ని అప్పగించి చేతులెత్తేశారు.

14 శాతమే అప్పగించారు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ మిల్లర్లకు 2022–23 యాసంగి సీజన్‌లో కేటాయించిన ధాన్యంలో బియ్యం ఇవ్వకుండా మిల్లుల వద్ద 2,98,259 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండాలని అధికారులు లెక్కలు తేల్చారు. ఈ ధాన్యానికి జనవరి నెలలో వేలం వేయగా వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు కొద్దిపాటిగా అప్పగించారు. కానీ, ఒక్క మిల్లులో కూడా బస్తా ధాన్యం లేదని సమాచారం. వేలం వేసిన ధాన్యంలో మిల్లర్లు అప్పగించిన ధాన్యం కేవలం 14 శాతమేనని ఇంకా ఎనిమిది శాతం ధాన్యం మిల్లర్లు అప్పగించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

ధాన్యం నిల్వలు తనిఖీ చేయకుండానే వేలం

కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించిన పౌరసరఫరాల శాఖ అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించారనే విమర్శలున్నాయి. ధాన్యం వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సమయంలో అసలు మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయో..? లేవా..? అని చూడకుండా కేవలం తాము కేటాయించిన ధాన్యం.. వారు తిరిగి బియ్యం ఇచ్చిన ధాన్యపోగా మిగిలిన ధాన్యం మిల్లుల్లోనే ఉన్నట్లు కాగితాల మీద లెక్కలు చూపారు. మిల్లుల్లో ధాన్యం లేదని తెలిస్తే అది తమ మెడకు చుట్టుకుంటుందని అధికారులు లేని ధాన్యం నిల్వలు మిల్లుల్లో ఉన్నట్లు చూపి వేలం వేశారు. వాస్తవానికి అక్కడ ఎలాంటి ధాన్యం లేదన్న విషయం అధికారులకు ముందే తెలుసని, దీనిపై విచారణ జరిపిస్తే అధికారుల తప్పిదాలన్నీ బయట పడతాయని పలువురు మిల్లర్లే అంటున్నారు.

రైతుకు అండగా నిలిచిన వైఎస్సార్



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- 2004లోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చారు
- సంక్రాంతికి రైతు భరోసా ఇస్తాం
- ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- యాదగిరిగుట్టలో ఆకట్టుకున్న గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు

యాదగిరిగుట్ట: రైతు సంక్షేమానికి నాటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు – 2024 నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఒకప్పుడు సాగు అంటే సంతోషంగా ఉండేదని, ఈ రోజు వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్తోందన్నారు. కొన్ని ప్రభుత్వాలు రైతులను విస్మరించి, కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహించడంతో రైతాంగం ఆగమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అందుకే 2004లో దేశంలో ఎక్కడ లేని విధంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించారన్నారు. రైతులకు అండగా నిలవాలని భావించి జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులు నిర్మించింది వైఎస్సార్ అని పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో 25లక్షల మందికి రూ.2లక్షల రుణమాఫీ చేశామన్నారు. వచ్చే సంక్రాంతికి రూ.7,500 రైతు భరోసాను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఫ్లోరైడ్‌ను శాశ్వతంగా తరిమేందుకు ఎస్‌ఎల్‌బీసీ, మూసీని శుద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలు త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. మల్లన్న సాగర్ కొండపోచమ్మ నుంచి బస్వాపూర్, గంధమల్ల ప్రాజెక్టులకు నీళ్లు తీసుకొచ్చి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం చేసేలా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రోత్సహించడం చాలా సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, జీజీపీ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, కన్వీనర్ పడమటి పావనీరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు, జిల్లా అధ్యక్షుడు మాటూరి అశోక్ పాల్గొన్నారు.



వేదిక ఎదుట చరఖా ప్రదర్శనలో విద్యార్థులు

న్యూస్‌రీల్

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో 2019 తర్వాత ఎన్‌రోల్ చేసుకున్న న్యాయవాదులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి కోరారు. ఆదివారం సూర్యాపేట జరిగిన ఆ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే న్యాయవాద రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రంగారావు, యూనియన్ సీనియర్ నాయకులు మొదుగు వెంకట్‌రెడ్డి, శ్రవణ్ కుమార్, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



సభ్యత్వం అందజేస్తున్న రాంబాబు

నూతనకల్: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు చెల్లించి ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు కోరారు. ఆదివారం నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో నిర్వహించిన ఆటో, ట్రాక్టర్, లారీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు సంఘం సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ మండల అధ్యక్షుడు పంతం వెంకన్న, బొజ్జ శ్రీనివాస్, ఇరుగు రమేష్, శివారెడ్డి, సురేష్, విజయ్‌రెడ్డి, తిరుమలేష్, జటంగి లింగయ్య, బత్తుల వెంకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్.. వరంలాంటిది



డైట్ పాఠశాలలో మాట్లాడుతున్న అరుణశ్రీ

నల్లగొండ రూరల్: చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్స్ ఒక వరం లాంటిదని ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ అరుణశ్రీ, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కల్లూరి సత్తమ్మ అన్నారు. నల్లగొండలోని బాలికల ఇంటర్మీడియట్ కళాశాల, డైట్ ప్రభుత్వ పాఠశాలలను ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు మధ్యలో మానేసినవారు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ చదవచ్చని తెలిపారు. అభ్యాసకులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో విశేష పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయాన్నే ఆలయాన్ని తీసిన అర్చకులు సుప్రభాతం, ఆరాధన నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన వంటి పూజలు చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం జరిపించారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు.

జనవరి 1 నుంచి గోదావరి జలాలు

- నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించిన ఇరిగేషన్ శాఖ అధికారులు
- వారబందీ పద్ధతిన వదిలేలా చర్యలు
- వచ్చే ఏడాది మార్చి వరకు నీరు



71 డీబీఎం కాలువలో పారుతున్న నీళ్లు

అర్వపల్లి: ప్రస్తుత యాసంగి సీజన్‌కు గాను జిల్లాకు గోదావరి జలాల విడుదలకు నీటి పారుదల శాఖ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. వారబందీ విధానం (వారం విడిచి వారం) పద్ధతిన పంటలకు నీరివ్వాలని నిర్ణయించారు. వచ్చే నెల జనవరి 1 నుంచి 7 వరకు జిల్లాకు గోదావరి జలాలు రానున్నాయి. ఆతర్వాత వారం మొదటి దశకు విడుదల చేస్తారు. తిరిగి జనవరి 15న ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వచ్చే ఏడాది మార్చి నెల వరకు జిల్లా గోదావరి జలాలు రానున్నాయి.

మూడు నియోజకవర్గాలకు..

సూర్యాపేట జిల్లాలోని ఎస్సారెస్పీ రెండవ దశలో ఉన్న తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలతో పాటు కోదాడ నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు గోదావరి జలాలు అందనున్నాయి. అయితే రెండవ దశ కింద జిల్లాలో సుమారు 2.50లక్షల ఆయకట్టు ఉంది. ఇప్పటికే కొందరు రైతులు వరినార్లు పోసుకోగా మిగిలిన రైతులు నీటి విడుదల షెడ్యూల్ కోసం ఎదురు చూస్తున్నారు. షెడ్యూల్ రావడంతో రెండవ దశ ఆయకట్టు పరిధిలోని రైతులు పనులు ముమ్మరం చేయనున్నారు. కాగా గత ఏడాది ఈ సమయానికి గోదావరి జలాలను విడుదల చేయగా ఈసారి కొంత ఆలస్యంగా నీటిని వదులుతున్నారు. అయితే షెడ్యూల్ ప్రకారం వారబందీ విధానంలో జిల్లాకు గోదావరి జలాలు రానున్నాయని బయ్యన్నవాగు డీఈఈ ఎం.సత్యనారాయణ తెలిపారు. పంటలకు వారబందీ విధానంలో నీళ్లు చాలవని పంటలు చేతికొచ్చే వరకు నీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేనివి

భానుపురి (సూర్యాపేట): అణగారిన వర్గాల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి చేసిన కృషి మరువలేనిదని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో దివంగత గడ్డం వెంకటస్వామి వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, టీఎన్‌జీఓ కార్యదర్శి దున్న శ్యామ్, హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నారసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో కలంకరించి కల్యాణతంతు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు అవమానకరం



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

సూర్యాపేట టౌన్: పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అవమానకరమని ప్రజా సంఘాల ఐక్య వేదిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్‌లో గల అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించినట్టేనన్నారు. వెంటనే అమిత్ షా ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది లింగంపల్లి భద్రయ్య, రేపాక లింగయ్య, పుప్పాల వీరన్న, చామకూరి నర్సయ్య, అబ్దుల్ కరీం, నారబోయిన వెంకట్‌యాదవ్, కునుకుంట్ల సైదులు, మట్టిపల్లి సైదులు, కంబాలపల్లి శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, కె.యోగానంద్, బండారు శ్రీను, పుప్పాల రవికుమార్, పబ్బతి వెంకటేశ్వర్లు, పంతం నర్సయ్య, జి.వెంకటేశ్వర్లు, వీరబోయిన రమేష్, డి.లాలయ్య మట్టిపల్లి సైదులు, కె.యోగానంద్, కె.వేణు, బి.క్రాంతికుమార్, దామల్ల వెంకన్న, డి.మహేష్, నాయకపు పరమేష్, ఎం.నాగయ్య, ఎస్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా నత్తనడకన..

- రెండు శాతం కూడా పూర్తికాని అపార్ నమోదు కార్యక్రమం
- ఆధార్ సమస్యతో ఆలస్యంగా ప్రక్రియ
- అన్ని స్కూళ్లూ వెనుకంజలోనే..
- నెలాఖరులోగా పూర్తి చేస్తామంటున్న అధికారులు



అపార్ కార్డు

మొత్తం స్కూళ్లు	1,314
విద్యార్థులు	1,44,412
అపార్ కేటాయించింది	2,488

హుజూర్‌నగర్: వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో ప్రతి విద్యార్థి సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నంబర్ కేటాయింపు ప్రక్రియ జిల్లాలో నత్తనడకన కొనసాగుతోంది. అపార్ పేరుతో కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికి 12 అంకెల గుర్తింపు నంబర్ కేటాయిస్తున్నారు. తొలి దశలో 2 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అపార్ జారీ చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ మాసం నుంచి ప్రారంభించినప్పటికీ వివిధ కారణాలతో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడంలేదు.

1.44లక్షల విద్యార్థులు

జిల్లాలో అన్ని రకాల యాజమాన్యాల విద్యాసంస్థలు కలిపి 1,314 ఉండగా వీటిల్లో మొత్తం 1.44లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 2,488 మందికి అపార్ ఐడీ నమోదు జారీ చేశారు. ఇప్పటి వరకు 2 శాతం కూడా పూర్తికాలేదు. అపార్ నమోదులో రాష్ట్రంలో మన జిల్లా 12వ స్థానంలో నిలిచింది. ఒకవైపు ప్రతినెలా 9, 10 తేదీల్లో మెగా అపార్ దివస్ నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో నూతనంగా విద్యార్థికి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉండేలా చర్యలు తీసుకుంటూ ఆధార్ అప్‌డేషన్ కలిగి ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. కానీ, చాలా మంది విద్యార్థులకు ఆధార్ నంబర్ లేకపోవడంతోపాటు ప్రస్తుతం పాఠశాలలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించాల్సిన సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తుండడంతో నమోదు ప్రక్రియ ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా అన్ని స్కూళ్లూ అపార్ నమోదులో వెనుకబడ్డాయి.

నెలాఖరులోగా పూర్తికి చర్యలు



జిల్లాలో అపార్ నమోదు ఈ నెలాఖరు వరకు నూరు శాతం పూర్తికి వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక టీమ్‌లను నియమిస్తాం. ఇప్పటికే ఎంఈఓలు, హెచ్‌ఎంలతో పాటు అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు జూమ్ మీటింగ్ కూడా నిర్వహించాం. వారు కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. కావాల్సిన పత్రాలు తెప్పించి నమోదు చేయించాలి.

– కె.శ్రావణ్ కుమార్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్, సూర్యాపేట

'శాండ్ ట్యాక్సీ'కి విశేష స్పందన

- నెల రోజుల్లో 1,800 ట్రాక్టర్లకు పైగానే బుకింగ్
- ఇప్పటికే 1,400 ట్రాక్టర్ల వరకు సరఫరా
- తక్కువ ధరకే ఇంటికొస్తున్న ఇసుక
- ఆనందంలో నాలుగు మండలాల ప్రజలు



బుకింగ్ చేసుకున్న వారి ఇళ్లకు ఇసుక ట్రాక్టర్లను పంపుతున్న రెవెన్యూ సిబ్బంది

అర్వపల్లి: మన ఇసుక –మన వాహనం పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న శాండ్ ట్యాక్సీ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నెల రోజుల నుంచి అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ఇసుకను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటుండగా రెవెన్యూ, ఇతర అధికారులు నేరుగా వినియోగదారుల ఇళ్లకే సరఫరా చేయిస్తున్నారు. దీంతో గతంలో కొన్ని నెలలుగా నిలిచిపోయిన ఇళ్లు, ఇతర నిర్మాణాల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కాగా గతంలో ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొని వినియోదారులు తీవ్రంగా నష్టపోయారు. శాండ్ ట్యాక్సీ పథకంతో తక్కువ ధరకు సరఫరా అవుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నెల రోజుల నుంచి..

ఈ విధానం మొదలైన నెల రోజుల్లోనే ఇప్పటి వరకు 1,800 ట్రాక్టర్ల ఇసుకకు పైగానే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోగా 1,400 ట్రాక్టర్ల వరకు సరఫరా చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం, నాగారం, తుంగతుర్తి మండలాలతో పాటు సూర్యాపేట నియోజకవర్గంలోని సూర్యాపేట మండల ప్రజలకు ఇక్కడి నుంచి ఇసుక సరఫరా జరుగుతోంది. అయితే గతంలో మూసీనది నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్వపల్లికి ఇసుక సరఫరాకు ఒక్కో ట్రాక్టర్‌కు సుమారు రూ.5వేల వరకు వినియోదారునికి ఖర్చు అయ్యేది. ఈ కొత్త విధానంతో కేవలం రూ.2,319కే ట్రాక్టర్ ఇసుక లభిస్తోంది. ఈ లెక్కన ఒక్కో ట్రాక్టర్ ఇసుకకు వినియోగదారునికి సుమారు రూ.2,700 వరకు అదనపు భారం తగ్గింది. అయితే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిందని, ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించాలని అధికారులకు నాలుగు మండలాల ప్రజలు, వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారం చాలా తగ్గింది



ఇంతకు ముందు నా ఇంటి నిర్మాణం కోసం ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4 నుంచి రూ.5 వేల వరకు వెచ్చించి ఇసుకను తెచ్చుకున్నాను. శాండ్ ట్యాక్సీ పథకంతో రూ.2,319కే ట్రాక్టర్ ఇసుక సరఫరా చేస్తున్నారు. దీంతో ఆర్థిక భారం చాలా తగ్గింది.

– జిల్లా కిరణ్, అర్వపల్లి

సద్వినియోగం చేసుకోవాలి



శాండ్ ట్యాక్సీ పథకంతో ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టే వారికి అదనపు భారం తగ్గింది. తక్కువ ధరకు ఇసుక సరఫరా చేస్తున్నాం. నాలుగు మండలాల ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నెల రోజుల వ్యవధిలో ఈ పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

– జక్కర్తి శ్రీనివాసులు, తహసీల్దార్, జాజిరెడ్డిగూడెం

క్లుప్తంగా

కుక్కల దాడి.. రెండు గొర్రెలు మృతి

డిండి: మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన కుందేళ్ల తిరుపతయ్యకు చెందిన రెండు గొర్రెలు ఆదివారం గ్రామంలో వీధి కుక్కలు దాడిలో మృతిచెందాయి. మృతిచెందిన గొర్రెల విలువ రూ.20వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. గతంలో కూడా పలుమార్లు ఇలాగే జరిగిందని, గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భానుసప్తమి కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. యజ్ఞశాలలో మహాసౌర హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, ఇంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నాగారం: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన నాగారం మండలం ఈటూరు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈటూరు గ్రామానికి చెందిన మాదగాని సోమయ్య రేకుల ఇంట్లో నివాసముంటున్నాడు. ఆదివారం ఇంట్లో సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టి బయట వరండాలో పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లోని కరెంట్ స్విచ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ జరిగి సెల్‌ఫోన్ చార్జర్ పేలి మంటలు వ్యాపించాయి. ఇంట్లోని బట్టలు, సామాగ్రి, ఆస్తి పత్రాలు, రూ.10వేల నగదు కాలిబూడిదయ్యాయి. ఇంట్లోంచి పొగలు వస్తున్న విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేసి మంటలను ఆర్పివేశారు. రూ.60వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం తనకు పక్కా ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని బాధితుడు సోమయ్య కోరాడు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కరుణ యువజన సంఘం నాయకులు

నాగారం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నాగారం మండల పరిధిలోని ఫణిగిరి సీఎస్ఐ చర్చి ఆవరణలో కరుణ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం, మంగళవారం ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కరుణ యువజన సంఘం అధ్యక్షుడు వేల్పుల వెంకన్న తెలిపారు. ఈ పోటలను విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో కబడ్డీ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.12,016, రెండో బహుమతి రూ.10,016, మూడో బహుమతి రూ.8,016, నాల్గో బహుమతి రూ.6,016, షీల్డ్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 91007 70810, 9652180361, 7995839111 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇటుక ప్రసాద్, బాషమల్ల సందీప్, శేఖర్, కర్నె అఖిల్, మణికుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

యాదగిరీశుడి క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆలయ ముఖ మండపంలో స్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు



దేవస్థానం అధికారులకు నగదు అందజేసేందుకు వెళ్తున్న సత్యనారాయణ దంపతులు

- స్వామి దర్శనానికి మూడున్నర గంటల సమయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు అధికంగా తరలివచ్చారు. దీంతో స్వామివారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటల సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ పరిసరాలు, ప్రసాద విక్రయశాల, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, మాఢ వీధులు భక్తులతో నిండుగా కనిపించాయి. స్వామిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో యాదగిరీశుడి ఆలయానికి రూ.57,52,702 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పాశురాలను పఠించారు. ఈ పూజల్లో మహిళ భక్తులు అధికంగా పాల్గొన్నారు.

స్వర్ణతాపడానికి రూ.5 లక్షల విరాళం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమానగోపురానికి స్వర్ణతాపడం కోసం హన్మకొండకు చెందిన వాకా సత్యనారాయణ, జయలలిత దంపతులు ఆదివారం రూ. 5,01,116 లక్షల విరాళం అందజేశారు. స్వామిని దర్శించుకున్న అనంతరం దేవస్థానం ఈఓ కార్యాలయంలో అధికారులకు నగదు అందజేశారు.

బీజేపీ.. రాజ్యాంగాన్ని మారుస్తుందని భయమేస్తోంది



మాట్లాడుతున్న ఎంపీ చామల, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, బీర్ల ఐలయ్య, మోత్కుపల్లి

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేస్తుందేమోనని భయమేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో హోంశాఖ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌పై బీజేపీ ఏ నినాదంతో ముందుకు వెళ్తుందో తెలంగాణ ప్రజలకు తెలియజేస్తామన్నారు. అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈసారి పార్లమెంట్ సెషన్ అంతా జమిలీ ఎన్నికలపై తప్ప మరో విషయంపై చర్చే జరగలేదన్నారు. బీజేపీకి ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై ప్రేమలేదన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. ఈ రోజుల అందరికీ రాజకీయ పదవులు ఉన్నాయంటే అది అంబేద్కర్ పెట్టిన బిక్షే అని, అటువంటి అంబేద్కర్‌ను కించపరిచేలా అమిత్ షా మాట్లాడారన్నారు. బీజేపీకి కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రాడు, ప్రతిపక్షాలు అసెంబ్లీలో వ్యవహరించిన తీరు బాధాకరమని అన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. అంబేద్కర్ పేరును దేవుడిని తలుచుకున్నట్లు పేదలు తలుచుకుంటున్నారన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దళిత, పేద ప్రజలను అవమానచినట్లేనని తెలిపారు. అమిత్ షా కచ్చితంగా దేశ ప్రజలకు, అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ చైతన్యరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుధా, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బాలరాజుగౌడ్, భిక్షపతిగౌడ్, సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, సంజీవరెడ్డి తదితరులున్నారు.

28 నుంచి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహా సభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

సూర్యాపేటటౌన్: నల్లగొండలో ఈ నెల 28వ నుంచి 30వ తేదీ వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) 6వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు పిలుపునిచ్చారు. ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ గత 10 సంవత్సరాలుగా తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సోమయ్య, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు బి.ఆడం, వి. రమేష్, సీహెచ్. రమేష్, లాలు, శ్రీనివాసచారి, శ్రీను, అభినవ్, ఆనంద్, సీనయ్య, సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, పాపిరెడ్డి, సైదా, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐతో దురుసుగా ప్రవర్తించిన యువకులు

- ఇద్దరు అరెస్ట్, మరొకరు పరారీ

కోదాడరూరల్ : రోడ్డు వెంట గొడవ పడుతున్న యువకులను ఆపేందుకు వెళ్లిన ఓ ఏఎస్ఐపై ముగ్గురు యువకులు దురుసుగా ప్రవర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని రామాలయం వద్ద రోడ్డు వెంట వ్యాపారం చేసుకుంటున్న ఓ వ్యక్తితో ఆదివారం ముగ్గురు యువకులు గొడవ పడుతున్నారు. అదే సమయంలో కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఏఎస్ఐ అటుగా వెళ్తూ గొడవను చూసి వారి వద్దకు వెళ్లి ఆపే ప్రయత్నం చేశాడు. ఆ యువకులు సివిల్ డ్రెస్‌లో ఉన్న ఏఎస్ఐని నువ్వు ఎవరని ప్రశ్నించగా.. తాను పోలీస్‌ని అని చెప్పినా వినకుండా బైక్ తాళం తీసుకొని దురుసుగా ప్రవర్తించారు. దీంతో సదరు ఏఎస్ఐ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు పరారయ్యాడు. పట్టుబడిన ఇద్దరు యువకులు మత్తులో ఉన్నట్లు సమాచారం.

30 టన్నుల నల్లబెల్లం పట్టివేత

తుంగతుర్తి, తిరుమలగిరి: అక్రమంగా లారీలో తరలిస్తున్న 30 టన్నుల నల్లబెల్లాన్ని తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు వద్ద తుంగతుర్తి ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లయ్య విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం పరిధిలోని వెలిశాల ఎక్స్‌రోడ్డు వద్ద తుంగతుర్తి ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి మహబూబాబాద్ జిల్లా పరిధిలోని తొర్రూర్ సమీపంలోని తండాలకు లారీలో తరలిస్తున్న సుమారు 30టన్నుల నల్లబెల్లం, 100 కేజీల పటిక, 20 లీటర్ల నాటుసారాని పట్టుకున్నారు. లారీ డ్రైవర్ గంగారాంను అదపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు తమన వినీత్, షేక్ ఫరూక్ పరారీలో ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత, ఎక్సైజ్ ఎస్ఐలు మూర్తి, రామకృష్ణ, సిబ్బంది ఆంజనేయులు, కొండల్, ఇబ్రహీం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పట్టుబడిన నల్లబెల్లాన్ని చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

దివ్యాంగుల కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలి



సంకెళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

ఆత్మకూర్ (ఎస్): దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని మంగలితండాలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేతులకు సంకెళ్లు వేసుకుని దివ్యాంగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ శాఖను ఏర్పాటుచేసి రూ.3000 కోట్లు కేటాయించాలని, ఈ శాఖకు మంత్రిగా దివ్యాంగుడినే నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్యబాబు, సుమతి, రాంబాబునాయక్, లచ్చు, సక్రు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన సదస్సులో ఆకట్టుకున్న స్టాల్స్



విజ్ఞాన సదస్సులో ఏర్పాటు చేసిన గాంధీజీ ఫొటో గ్యాలరీ



ఎద్దు గానుగ నూనె తయారీని చూపుతున్న విద్యార్థులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు -2024'లో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. 1938 నుంచి 1947 వరకు గాంధీజీ చేసిన స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన ఫొటో గ్యాలరీతో పాటు చేనేత వస్త్రాలు, సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహార ధాన్యాలు, కూరగాయలు, ఎలక్ట్రికల్ వాహనాలు, బ్లూబెర్రీ, టేకు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు, చిరు ధాన్యాలతో తయారుచేసిన తినుబండారాలు, స్వీట్లు, వివిధ దేశాల కరెన్సీ, గాంధీ విగ్రహాలు, చరక ప్రదర్శన అందరినీ ఆకర్షించాయి. వీటితో పాటు ఇంట్లో పండించుకునే సేంద్రియ కూరగాయల విత్తనాలు, ప్రకృతి వ్యవసాయంలో పండించిన పసుపు, పెసర్లు, పల్లీలు, అల్లం వంటివి వాటిని సదస్సుకు విచ్చేసిన ప్రజలు కొనుగోలు చేశారు. ఎద్దు గానుగ నూనె తయారీ విధానాన్ని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూసీ ప్రక్షాళనతో నీళ్లు ఏవిధంగా మారుతాయి, ప్రస్తుతం మూసీ నది ఎలా ఉందనే అంశాలపై విద్యార్థులు ఎగ్జిబిట్లు ప్రదర్శించారు.



బయో గ్యాస్ తయారీ విధానాన్ని వివరిస్తున్న విద్యార్థులు



కోటి లహరికశ్రీధర్‌కు కిసాన్ సేవా రత్న అవార్డు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి విలేకరి సురేష్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

భువనగిరి: అనారోగ్యంతో మృతి చెందిన సాక్షి దినపత్రిక భువనగిరి రూరల్ విలేకరి ఏనుగు సురేష్‌రెడ్డికి ఆదివారం సహచర జర్నలిస్టులు, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్‌రెడ్డి శనివారం రాత్రి భువనగిరి పట్టణంలోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత అంతిమయాత్రను నిర్వహించి పెద్ద చెరువు సమీపంలో ఉన్న శ్మశానవాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.

నివాళులర్పించిన జర్నలిస్టులు

భువనగిరి పట్టణంలోని ప్రిన్స్‌చౌరస్తా వద్ద ఏనుగు సురేష్‌రెడ్డి చిత్రపటానికి పలువురు జర్నలిస్టులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ జర్నలిస్టు జీవీ శ్రీనివాస్, జర్నలిస్టుల సంఘాల నాయకులు మణికొండ మల్లేష్, యంబ నర్సింహులు, భువనగిరి మల్లేశం, పోతంశెట్టి కరుణాకర్, పాశం నవీన్, ఎలిమినేటి జహంగీర్, తాళ్ల భాస్కర్, గోవర్ధన్‌చారి, గడసందుల నాగరాజు, కూరెళ్ల మల్లేష్, దుడక రామకృష్ణ, జమాలుద్దీన్, మాటూరి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నివాళుర్పించిన ఎమ్మెల్యే, నాయకులు

సురేష్‌రెడ్డి భౌతికకాయానికి భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, ప్రమోద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకుడు కొండమడుగు నర్సింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకుడు ఏసాల అశోక్, ఏఐటీయూసీ నేత ఇమ్రాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నర్సింహ, యువజన సంఘాల నాయకుడు దాసరి శ్రీనివాస్, బీజేపీ నాయకుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.



సురేష్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. యువకుడి దుర్మరణం

- కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఆటోలో ఆస్పత్రికి తరలించే యత్నం
- అడ్డుకొని ఆందోళన చేపట్టిన బంధువులు



రామలింగం (ఫైల్)

నాంపల్లి: బైక్‌పై వెళ్తున్న యువకుడిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన నాంపల్లి మండలం కేతపల్లి గ్రామ శివారులో ఆదివారం జరిగింది. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి మండలం కొత్తబావి గ్రామానికి చెందిన పిల్లి రామలింగం (28) ఆదివారం బైక్‌పై నాంపల్లి మండలం దామెర గ్రామంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కేతపల్లి గ్రామ శివారులోకి రాగానే మల్లేపల్లి నుంచి వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో రామలింగం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తై ఉన్నారు.

కేసును పక్కదారి పట్టించే యత్నం

ఘటన జరిగిన సమయంలో ట్రాక్టర్‌కు నంబర్ ప్లేట్ ఉందని, గంట తర్వాత చూస్తే నంబర్ ప్లేట్ లేదని గ్రామస్తులు, బాటసారులు చెబుతున్నారు. ఈ కేసును పక్కదారి పట్టించడం కోసమే ట్రాక్టర్ నంబర్ ప్లేట్ లేకుండా, టైరులో గాలి సైతం తీసేశారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్‌కు ముందు వైపు ఒక సైడ్ మాత్రమే లైట్ రావడంతో ఎదురుగా బైక్ వస్తుందనుకని రామలింగం ట్రాక్టర్‌ను ఢీకొట్టినట్లు గ్రామస్తులు వాదిస్తున్నారు.

మృతదేహాన్ని అడ్డుకొని ఆందోళన

రామలింగం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆటోలో ఎస్ఐ దేవరకొండకు తీసుకెళ్తుండగా.. మృతుడి బంధువులు, గ్రామస్తులు కేతపల్లి శివారులో ఆటోను అడ్డగించి ఆందోళన చేశారు. రెండు గంటల పాటు పోలీసులతో మృతుడి బంధువులు వాగ్వాదానికి దిగారు. తమకు న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లడానికి వీల్లేదని రోడ్డుపై బైఠాయించారు.

మొక్కజొన్న సాగులో మెళకువలు

పాడిపంట

నడిగూడెం: ప్రస్తుత రబీ సీజన్‌లో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలు మొక్కజొన్న సాగు ప్రయోజనకరమని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ సూచిస్తున్నారు. మొక్కజొన్న సాగు గురించి సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

- రబీ సీజన్‌లో మొక్కజొన్నను జనవరి వరకు విత్తవచ్చు. విత్తేముందు మూడు, నాలుగుసార్లు బాగా దుక్కి దున్నాలి. చాళ్ల మధ్య 65–70 సెం.మీ. దూరం ఉండేలా చూసుకోవాలి. చాళ్లలో మొక్కల మధ్య 20–25 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. ఒక ఎకరానికి సాధారణ రకాలు 7 కిలోల విత్తనం అవసరం. ఎకరానికి 40 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 10 కిలోల పొటాష్ ఎరువులను విత్తే ముందు ఆఖరి దుక్కిలో వేయాలి. రెండోసారి నత్రజనిని చాళ్లలో వేసి, మట్టి ఎగదోయాలి. పూతకు ముందు మరోసారి నత్రజని వేయాలి.
- **నీటి యాజమాన్యం:** మొక్కజొన్న పంటకు 400 – 500 మి.మీ. నీరు సరిపోతుంది. పైరు పూత దశకు ముందు పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో నీరు అవసరం. ముఖ్యమంగా మురుగు నీరు పోయే వసతి ఉండేలా చూసుకోవాలి. చాళ్ల పద్ధతిలో నీరు పారించాలి. ఇలా చేయడం వలన నీరు వృథాకాదు. మొక్కజొన్న పైరులో జింక్ లోపం కనిపిస్తే 2 గ్రాములు జింక్ సల్ఫేట్ లీటరు నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

ఆశించే పురుగులు–నివారణ చర్యలు

1. **కాండం తొలుచుపురుగు** : ఇవి రెండు రకాలు. మచ్చలు లేదా చారల కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఖరీఫ్ సీజన్‌లో ఆశిస్తుంది. గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా రబీ సీజన్‌లో ఆశిస్తుంది. ఇవి పైరును 10–20 రోజులకు ఆశిస్తాయి. పిల్ల పురుగులు మొదటగా ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుచుకొని ఉన్న ఆకు ద్వారా కాండం లోపలికి చేరతాయి. ఈ ఆకులు విచ్చుకున్న తర్వాత గుండు సూది మాదిరి రంధ్రాలు లేదా పొడవాటి చిల్లులు ఆకులపై వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వు చనిపోయి, ఎండిపోతుంది.



నడిగూడెంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

నివారణ చర్యలు: పొలంలో కలుపు మరియు చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి. పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పొలం చుట్టూ 3–4 వరుసలలో జొన్నను ఎర పంటగా వేసి, 45 రోజుల తర్వాత తీసివేయాలి. అంతర పంటలుగా అపరాలను (కంది, సోయాబీన్, బొబ్బర్లు) సాగుచేయడం వలన సహజ శత్రువుల సంఖ్య పెరుగుతుంది. మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పైరు మొలకెత్తిన 10–12 రోజులకు పిచికారీ చేయాలి. అవసరమైతే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి 3 కిలోలు చొప్పున మొలకెత్తిన 25–30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

2. **రసం పీల్చే పురుగులు:** 30 రోజుల పైబడిన పైరును పేనుబంక, చిగురు నల్లి ఆశించవచ్చు. పొడి వాతావరణంలో వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకు లేక కాండం నుండి రసాన్ని పీల్చడం వలన ఆకులు పుసుపు రంగుకు మారిపోతాయి. మొక్క గిడసబారిపోతుంది. ఇవి విసర్జించే తేనె లాంటి జిగురు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంధ్రాలు ఏర్పడి మసి తెగులు ఆశించడం వలన కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

నివారణ చర్యలు: సహజంగా అక్షింతల పురుగులు, సర్ఫిడ్స్ వంటి పరాన్నభుక్కులు మరియు పరాన్న జీవులు ఈ పురుగులను అదుపులో ఉంచుతాయి. రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోఫాస్ ఎకరానికి 320 మి.లీ. లేదా డైమీథోయేట్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలోకలిపి పిచికారీ చేయాలి.

3. **టర్సికమ్ ఆకు ఎండు తెగులు** : ఆకులపై పొడవైన కోలాకారపు బూడిద రంగుతో కూడిన ఆకుపచ్చ లేక గోధుమ వర్ణపు మచ్చలు కన్పిస్తాయి. ఈ మచ్చలు 2.5 నుంచి 25 సెం.మీ పొడవు మరియు 4 సెం.మీ. వెడల్పు ఉంటాయి. ఈ మచ్చలు మొదట మొక్క కింద ఆకులపై కన్పించి, పెద్దవై పైఆకులకు కూడా వ్యాపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణంలో ఆకు అంతా ఎండి మొక్కలు చనిపోయినట్లుగా కన్పిస్తాయి. శిలీంధ్ర బీజాలు ఆకుల అడుగు భాగాన వలయాలుగా కన్పిస్తాయి. ఈ మచ్చలు కండెపై ఉన్న పొట్టుపై కూడా వ్యాపిస్తాయి.

4. **తుప్పు తెగులు** : ఆలకుపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కుల మాదిరిగా తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగిన కొలది ఆకులపైన పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. పూత సమయంలో తెగులు లక్షణాలు స్పష్టంగా కన్పిస్తాయి. అధిక తేమ గల చల్లని వాతావరణంలో తెగులు ఉధృతి మరియు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

పై రెండు రకాల తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రలను బట్టి ఒకటి లేక రెండు సార్లు పిచికారీ చేయాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాములు మాంకోజెబ్‌తో కలిపి విత్తన శుద్ధి చేయాలి.

పంట కాలం : మొక్కజొన్న పొత్తు తయారైన తర్వాత కండెపై గల పొరలు ఎండి గింజ మొదట్లో నల్లటి చారలు ఏర్పడి పంట పరిపక్వతను సూచిస్తాయి. కండెను తెంపి 3–4 రోజులు ఎండలో ఆరబెట్టాలి. కండెల నుంచి గింజలను తీసేందుకు షెల్లర్ అనే యంత్రాన్ని వాడితే ఖర్చు ఆదా అవుతుంది. పేలాల (పాప్‌కార్న్) రకం వేసినప్పుడు గింజల్లో 30–35 శాతం తేమ ఉన్నప్పుడే కండెలు కోసి నీడలో ఆరబెట్టాలి. తీపి కండె రకం వేసినప్పుడు గింజ పాలు పోసుకొనే దశలో కండెలు కోసుకోవాలి. అంబర్ పాప్‌కార్న్, మాధురి రకాలను గింజలు కట్టకముందే కోసి. బేబీకార్న్‌గా వాడుకోవచ్చు. పశువుల మేత కోసం విత్తితే 50 శాతం పూత దశలో పైరు కోసుకొని గ్రాసంగా ఉపయోగించుకోవచ్చు.